# వాస్తవం

డిజిటల్ పత్రిక

ఉన్నది ఉన్నట్లుగా

డెయిలీ. కామ్

సోమవారం
23.02.2026

ఎడిటర్: ఎం.కృష్ణారెడ్డి


లొంగిపోయిన

## మావోయిస్టు అగ్రనేతలు

ఆపరేషన్ కగార్‌లో కీలక పరిణామం



కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌లో కీలక పరిణామం చోటు చేసుకుంది. మావోయిస్టు పార్టీ అగ్రనేతలు దేవ్ జీ అలియాస్ తిప్పిరి తిరుపతి, మల్లా రాజిరెడ్డితోపాటు 16 మంది మావోయిస్టులు లొంగిపోయారు. ఆదివారం ఆసిఫాబాద్ అడవుల్లో తెలంగాణ ఎస్ఐబీ ఎదుట వీరంతా లొంగిపోయారు. దేవ్ జీ ప్రస్తుతం మావోయిస్టు పార్టీ కేంద్ర కేంద్ర కమిటీ సభ్యుడు, సెక్రెటరీ జనరల్‌గా కొనసాగుతున్నారు.

2లో..

# కాళేశ్వరాన్ని కొనసాగిస్తాం

### ➤ మరమ్మతులు చేసి వినియోగంలోకి తెస్తాం

**వరంగల్, ఫిబ్రవరి 22 :** వేల కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును వినియోగంలోకి తీసుకొస్తామని సీఎం రేవంత్ స్పష్టంచేశారు. ప్రాజెక్ట్‌లో భాగమైన అన్నారం, మేడిగడ్డ, సుందిళ్ల బరాజ్‌లకు మరమ్మతులు చేసి, భవిష్యత్తులో ఎలాంటి ప్ర మాదాలు జరుగకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సాంకేతిక నిపుణులతో చర్చిస్తున్నామని, కమిటీలు, ఏజెన్సీలను నియమించామని చెప్పారు. ప్రాజెక్ట్‌పై పూర్తిస్థాయి అధ్యయనం చేస్తున్నామని వివరించారు. ఆదివారం ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని దేవాదుల ప్రాజెక్ట్‌ను సీఎం రేవంత్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అంతకు ముందు సమ్మక్క బరాజ్‌ను (మిగతా10లో..)



- మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బరాజ్‌లకు రిపేర్లు చేయిస్తాం
- దేన్నీ గాలికి వదిలేయం.. సాంకేతిక నిపుణులతో చర్చిస్తున్నాం
- 2027 డిసెంబర్‌లోగా దేవాదుల పూర్తిచేస్తాం
- నెల రోజుల్లో పంప్‌హౌస్‌కు మరమ్మతులు
- దేవాదులపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- సమ్మక్క బరాజ్, దేవాదుల పంప్‌హౌస్ పరిశీలన

10లో..

రూ.వేల కోట్లతో కట్టిన కాళేశ్వరంను వినియోగంలోకి తెస్తాం. ఏ బరాజ్‌నూ గాలికి వదిలేయం. సాంకేతిక నిపుణులతో చర్చిస్తున్నాం. కమిటీలతో మాట్లాడుతున్నాం. ఏజెన్సీలను నియమించాం. భూమి మీద కనిపించేది మాత్రమే కుంగింది. నీటి లోపలి సమస్యలపై అధ్యయనం చేయాలి. ప్రజల సొమ్ముతో కట్టిన అన్నారం, మేడిగడ్డ, సుందిళ్ల బరాజ్‌లకు మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకొస్తాం.

-- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

# పథకం ప్రకారమే బొగ్గుల శ్రీనివాస్ హత్య





4లో..

ప్రముఖ రచయిత, సాహిత్య పరి శోధకుడు, యూట్యూబర్ బొగ్గుల శ్రీనివాస్(48)ని ఈనెల 14వ తేదీన ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని పాలేరు రిజర్వాయర్‌లో కారుతో సహా పడేశారు. ఈ విష యంపై అనుమానం వచ్చిన పోలీ సులు దర్యాప్తు జరిపారు. పోలీసుల విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి.

# భారత్ బేజారు

111 పరుగులకు ఆలౌట్

యాన్సెన్, మహారాజ్ విజృంభణ

సూపర్-8లో సఫారీల ప్రతీకారం




**అహ్మదాబాద్ :** ప్రతిష్టాత్మక టీ20 ప్రపంచకప్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ వరుస విజయాలకు దక్షిణాఫ్రికా బ్రేక్ వేసింది. సూపర్-8లో భాగంగా ఆదివారం జరిగిన తమ తొలి పోరులో టీమ్‌ఇండియా 76 పరుగుల తేడాతో సఫారీల చేతిలో ఘోరంగా ఓటమిపాలైంది. గ్రూపు దశలో అపజయమెరుగని సూర్యకుమార్‌యాదవ్ నేతృత్వంలోని టీమ్‌ఇండియా.. కీలకమైన సూపర్-8లో తేలిపోయింది. దీంతో పొట్టి ఫార్మాట్‌లో వరుసగా 12 విజయాలకు ఫుల్‌స్టాప్ పడగా, గత ప్రపంచకప్ ఫైనల్లో ఎదురైన ఓటమికి దక్షిణాఫ్రికా దీటైన ప్రతీకారం తీర్చుకుంది. సఫారీలు నిర్దేశించిన 188 పరుగుల లక్ష్యఛేదనలో టీమ్‌ఇండియా 18.5 ఓవర్లలో 111 పరుగులకు ఆలౌటైంది. యాన్సెన్(4/22), కేశవ్ మహారాజ్(3/24), కార్బన్ బాశ్(2/12) విజృంభణతో టీమ్‌ఇండియా బ్యాటింగ్ కుదేలైంది. దూబే(42) ఒంటరిపోరాటం జట్టును గెలిపించలేకపోంది. హ్యాట్రిక్ డక్‌లతో పేలవ ఫామ్‌లో ఉన్న ఓపెనర్ అభిషేక్‌శర్మ(15) ఎట్టకేలకు మెగాటోర్నీలో పరుగుల ఖాతా తెరువగా, ఈసారి ఇషాన్ కిషన్(0) తన వంతు అంటూ సున్నా చుట్టాడు. తిలక్‌వర్మ(1) మరోమారు విఫలం కాగా, మిడిలార్డర్‌లో సూర్యకుమార్(18), సుందర్(11), హార్దిక్(18), రింకూ(0) ఘోరంగా విఫలమయ్యారు. పిచ్ పరిస్థితులకు తగ్గట్లు సఫారీ బౌలర్లు స్లో బాల్స్‌తో టీమ్‌ఇండియా వికెట్ల వేట కొనసాగించారు. ముఖ్యంగా యాన్సెన్, ఎంగ్డీ భారత బ్యాటర్లకు కళ్లెం వేయగా, మహారాజ్ ఒకే ఓవర్లో మూడు వికెట్లు తీసి భారత గెలుపు ఆశలపై నీళ్లు చల్లాడు. అంతకుముందు మిల్లర్(35 బంతుల్లో 63, 7ఫోర్లు, 3సిక్స్‌లు) అర్ధసెంచరీకి తోడు బ్రెవిస్(45), స్టబ్స్(44) రాణించడంతో దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 187/7 స్కోరు చేసింది. బుమ్రా (3/15), అర్ష్‌దీప్(2/28)ఆకట్టుకున్నారు. మిల్లర్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

దేశంలో మావోయిస్టు ఉద్యమం అంతమయి కేంద్రప్రభుత్వం విధించిన గడువు కంటే ముందే ఆపరేషన్ కగార్ విజయవంతమయ్యే పరిస్థితిలు కన్పిస్తు న్నాయి. కొన్ని దశాబ్దాలుగా జనతన సర్కార్ లాంటి సమాంతర ప్రభుత్వాన్ని నడిపిన మావోయిస్టు పార్టీ ఇక ఉనికి కోల్పోయినట్లేనని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు. మావోయిస్టు రహిత దేశం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌కు ఈ ఏడాది మార్చి 31వ తేదీని డెడ్ లైన్‌గా నిర్ణయించిన విషయం తెలిసిందే.

# లొంగుబాట

## చివరి దశకు ఆపరేషన్ కగార్





- దేశంలో మావో ఉద్యమం అంతమైనట్లేనా?
- మావోయిస్టు అగ్రనేతలు దేవ్‌జీతోపాటు మల్లా రాజిరెడ్డి సహా 25 మంది లొంగుబాట
- మార్చి 31 గడువులోగా మరిన్ని లొంగుబాట్లు?

**హైదరాబాద్, ఫిబ్రవరి 22:** దేశంలో మావోయిస్టు ఉద్యమం అంతమయి కేంద్రప్రభుత్వం విధించిన గడువు కంటే ముందే ఆపరేషన్ కగార్ విజ యవంతమయ్యే పరిస్థితిలు కన్పిస్తు న్నాయి. కొన్ని దశాబ్దాలుగా జనతన సర్కార్ లాంటి సమాంతర ప్రభుత్వాన్ని నడిపిన మావోయిస్టు పార్టీ ఇక ఉనికి కోల్పోయినట్లేనని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు. మావోయిస్టు రహిత దేశం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌కు ఈ ఏడాది మార్చి 31వ తేదీని డెడ్ లైన్‌గా నిర్ణయించిన విషయం తెలిసిందే. మావోయిస్టు రహిత దేశం లక్ష్యంలో చివరి దశకు చేరుకున్నామని ఇటీవలే కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించారు. ఈ నెల మొదటి వారంలో రాయ్‌పూర్‌లో కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలు, నిఘా విభాగాల ఉన్నతాధికారులతో ఆయన సమావే శమై అడవుల్లో మిగిలిన మావోయి స్టుల ఏరివేత విషయంలో స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఆ తర్వాత ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఏపీ, ఒడిశా పోలీసులు మరో సంయుక్త ఆపరేషన్ ప్రారంభించి, నిఘా సమాచారాన్ని పంచుకుంటూ కీలక మావోయిస్టు నేత లోకేటి చందర్‌తో పాటు నలుగురిని ఎన్‌కౌంటర్ చేశారు. ఆ తర్వాత దేవ్‌జీ లక్ష్యంగా కర్రెగుట్టలపై కేంద్ర బలగాలను మోహరించి ఒత్తిడి పెంచారు. ఆ ఒత్తిడి ఫలించి మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్ తెలంగాణ పోలీసుల ఎదుట తాజాగా లొంగిపోయినట్లు తెలుస్తోంది. రాష్ట్ర కమిటీ సభ్యుడైన నర్సింహారెడ్డితో పాటు మొత్తం 25 మంది ప్రత్యేక ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ లొంగుబాటును రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి నిర్ధారించారు. దేవ్‌జీతో పాటు మరికొందరు మావోయిస్టులు తెలంగాణ పోలీసులకు లొంగిపోయారని ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం కూడా చెప్పారు. దీంతో ఆపరేషన్ కగార్ చివరి దశకు చేరినట్లయిందని అంటున్నారు. వాస్తవానికి 2019 నుంచి మావోయిస్టు పార్టీని టార్గెట్ చేసిన కేంద్రం.. పెద్ద ఎత్తున్న సీఆర్‌పీఎఫ్ దళాలను మోహరించి ప్రత్యేక ఆపరేషన్లు చేపట్టింది. లొంగుబాట్లు, ఎన్‌కౌంటర్ల ద్వారా మావోయిస్టు ఉద్యమాన్ని అంతం చేయడానికి యుద్ధప్రాతిపదికన చేపట్టిన చర్యలు ఫలించేలా ఉన్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. అమిత్‌షా ప్రకటన ప్రకారం మార్చి 31 తర్వాత ఆపరేషన్ కగార్‌ని ముగిస్తారా? లేక ఇంకొంత కాలం కొనసాగిస్తారా? అనేది తేలాల్సి ఉంది.

స్వీయ ప్రయోజనమా?

## ప్రజా ప్రయోజనమా?

ఏది పాఠకులకు ముఖ్యం?

8లో..

## పేదల ఆస్తులు కొల్లగొడితే ఊరుకోం

నోటిఫికేషన్ ఉపసంహరించుకునే దాకా పోరాడుతాం..మూసీ పరీవాహక ప్రజలందరికీ అండగా బీఆర్ఎస్

కాంగ్రెస్ ప్రభుత్వ విధ్వంసాన్ని అడ్డుకొని తీరుతాం..మాజీ మంత్రి హరీశ్‌రావు 'మధు పార్క్' నివాసితులకు భరోసా

7లో..



# నడుచుకుంటబోవుడే నయం

**రోడ్లకు గుంతలకు అవినాభావ సంబంధం**

**ముఖ్యమంత్రి ఆదేశాలు బేఖాతరు**


**ఎమ్మెల్యే ఇంటి పక్క గుంతలకే దిక్కులేదు**

**వాస్తవం : రాజేంద్రనగర్**

నగరంలో రోడ్లకు గుంతలకు ఎప్పటికీ విడదీయరాని బంధం ఉంటుందంటే అతిశయోక్తి కాదేమో. ఎందుకంటే గుంతలు లేని రోడ్లు ఉండవు. రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్దేవ్‌పల్లి ఉడంగడ్డ చౌరస్తా వద్ద ఇండియన్ స్వీట్ హౌస్ మూలమలుపు వద్ద బీటీ రోడ్డు గుంతలమయంతో ధ్వంసమైన దృశ్యాలు కనిపించాయి. గుంతల మయమైన రోడ్డుతో కొన్ని రోజులుగా వాహనదారులు నరకయాతన పడుతున్నారు. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడే లేకపోవటం సిగ్గుచేటని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో గుంతల కారణంగా వాహనాలు నెమ్మదిగా వెళుతుండడంతో తీవ్ర ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా వ్యాపార సముదాయాల వద్ద అక్రమ పార్కింగ్లతో నిత్యం ట్రాఫిక్ రద్దీకి కేరాఫ్ అడ్రస్‌గా ఈ ప్రాంతం మారిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉడంగడ్డ నుండి దుర్గనగర్ చౌరస్తాకు వెళ్లే మార్గంలో రహదారికి ఒకవైపు మూడు ట్రాక్‌ల రోడ్డు మార్గం ఉంది. ఇందులో విశేషమేమిటంటే ఈ రోడ్డులో ఒక ట్రాక్ మొత్తం వాహనాల అక్రమ పార్కింగ్, దుమ్ము ధూళి, ఇసుకమేటలతో దర్శనమిస్తుంది. బీటీ రోడ్డు లేకపోవడంతో వాహనాల రాకపోకల కారణంగా పరిసర ప్రాంతాలు దుమ్ము ధూళితో నిండిపోతున్నాయని దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోడ్ల విషయంపై రోడ్ల పరిశుభ్రతపై సీరియస్‌గా అధికారులకు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అధికారులు ఫీల్డ్‌లో ఉండాలని రోడ్ల పరిశుభ్రత పై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచనలు కూడా చేశారు. అయినా నెలల తరబడి ఇక్కడ రోడ్లపై సమస్యలు తిష్ట వేసినా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. నియోజకవర్గ ఎమ్మెల్యే ఇంటి పక్కనే ఉన్న రహదారిపై గుంతలకు కూడా దిక్కులేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజా ప్రతినిధుల ఇంటి వద్దనే సమస్యలు ఇలా ఉంటే సామాన్యుల సమస్యలను ఎవరు పట్టించుకుంటారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఎమ్మెల్యే ఇంటి పక్కన మూలమలుపు వద్ద రోడ్డు దుస్థితి



అక్రమ పార్కింగ్లు, దుమ్ము ధూళి, ఇసుకమేటలతో రహదారి దుస్థితి

### చర్యలు తీసుకోవాలి



రోడ్డు మార్గం సరిగా లేకపోవడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సాయంత్రం సమయాలలో విపరీతమైన ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుంది. గుంతల మయమైన రోడ్డుతో ఒకపక్క ట్రాఫిక్ రద్దీ మరోపక్క రాంగ్ రూట్లో వచ్చే వాహనాలతో పాదచారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రోడ్లను బాగు చేసి ట్రాఫిక్ నియంత్రణకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలి.

**స్థానికుడు, కరణ్ యాదవ్**

---

### ప్రశాంతంగా ముగిసిన

## టీజీఈ సెట్ ప్రవేశ పరీక్ష



**వాస్తవం : కాటారం**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని స్థానిక గిరిజన గురుకుల బాలుర కళాశాలలో నిర్వహించిన తెలంగాణ గురుకులాల టీజీఈ సెట్ ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్షా కేంద్రానికి మొత్తం 338 మంది విద్యార్థులను కేటాయించగా, 319 మంది హాజరయ్యారు. 19 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్, కళాశాల ప్రిన్సిపాల్ ఆసనాడ మాధవి తెలిపారు. డిపార్ట్మెంటల్ ఆఫీసర్ బంద్యాల రాజశ్రీ, అబ్జర్వర్ ఆర్‌సీఓ టి. హరిసింగ్ పర్యవేక్షణలో పరీక్షలు సజావుగా నిర్వహించబడ్డాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు పరీక్ష అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ఆసనాడ మాధవి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటయ్య, డిప్యూటీ వార్డెన్ రాజబాబు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, పీఈటీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు.

## లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేతలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 22:** కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌లో కీలక పరిణామం చోటు చేసుకుంది. మావోయిస్టు పార్టీ అగ్రనేతలు దేవ్ జీ అలియాస్ తిప్పిరి తిరుపతి, మల్లా రాజిరెడ్డితోపాటు 16 మంది మావోయిస్టులు లొంగిపోయారు. ఆదివారం ఆసిఫాబాద్ అడవుల్లో తెలంగాణ ఎస్ఐబీ ఎదుట వీరంతా లొంగిపోయారు. దేవ్ జీ ప్రస్తుతం మావోయిస్టు పార్టీ కేంద్ర కేంద్ర కమిటీ సభ్యుడు, సెక్రెటరీ జనరల్‌గా కొనసాగుతున్నారు. గతేడాది జరిగిన ఎన్‌కౌంటర్‌లో నంబాల కేశవరావు మరణించారు. ఆ తర్వాత మావోయిస్టు పార్టీకి దేవీజీ సారథ్యం వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది మార్చి 31 నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించేందుకు కేంద్రం 'ఆపరేషన్ కగార్' పేరిట ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ సందర్భంగా జన జీవన స్రవంతిలో కలిసి.. దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలంటూ మావోయిస్టులకు కేంద్రం పిలుపునిచ్చింది. దాంతో పలువురు మావోయిస్టులు ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. మరికొంత మంది ఎన్‌కౌంటర్‌లో మరణించారు. పలువురు మావోయిస్టులు అరెస్టయ్యారు. మరోవైపు ఆపరేషన్ కగార్ కోసం నిర్దేశించుకున్న సమయం మరికొద్ది రోజుల్లో ముగియనుంది.



# ఎరువుల పంపిణీ యాప్‌తో రైతుల అవస్థలు

**తక్షణమే స్పందించాలని రైతు సంఘాల డిమాండ్**

**తెలంగాణా రైతు సంఘం హనుమకొండ జిల్లా కార్యదర్శి ఉట్కూరి రాములు**

**వాస్తవం : ఎల్కతుర్తి**

ప్రస్తుత సాగు సీజన్‌లో రైతులకు అండగా ఉండాల్సిన యంత్రాంగం, సాంకేతికత పేరుతో వారిని మరింత ఇబ్బందులకు గురిచేస్తోందని తెలంగాణా రైతు సంఘం హనుమకొండ జిల్లా కార్యదర్శి ఉట్కూరి రాములు ఆవేదన వ్యక్తం చేశారు. ఎరువుల లభ్యత మరియు పంపిణీ కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త మొబైల్ యాప్ విధానం క్షేత్రస్థాయిలో విఫలమవుతోంద న్నారు. దీనివల్ల సామాన్య రైతులు పడుతున్న ఇబ్బందులను అధికారులు తక్షణమే గమనించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోరారు.

**సాంకేతిక అడ్డంకులు:** గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సిగ్నల్ సరిగ్గా లేకపోవడంతో యాప్ పనిచేయడం లేదు. దీనివల్ల రైతులు గంటల తరబడి ఎరువుల దుకాణాల వద్ద వేచి ఉండాల్సి వస్తోంది.



యూరియా యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు నిరసన చేస్తున్న దృశ్యం

**అవగాహన రాహిత్యం:** మెజారిటీ రైతులకు స్మార్ట్‌ఫోన్ వాడకంపై కనీస అవగాహన లేదు. యాప్ డౌన్లోడ్ చేసుకోవడం, రిజిస్ట్రేషన్ చేయడం వారికి ఒక పెద్ద సవాలుగా మారింది.

**సర్వర్ మొరాయింపు:** ఒకేసారి అందరూ యాప్ వాడటం వల్ల సర్వర్లు డౌన్ అవుతున్నాయి. దీంతో నిల్వలు ఉన్నప్పటికీ రైతులకు ఎరువులు పొందే అవకాశం దక్కడం లేదు.

**బయోమెట్రిక్ సమస్య:** పొలం పనులు చేసే రైతుల వేలిముద్రలు సరిగ్గా పడకపోవడంతో యాప్ ద్వారా ధృవీకరణ కావడం లేదు. ఫలితంగా అర్హులైన రైతులకు యూరియా అందడం లేదు.

**ప్రత్యామ్నాయ పద్ధతి:** యాప్ పనిచేయని పక్షంలో లేదా స్మార్ట్ ఫోన్ లేని రైతులకు ఆధార్ కార్డు మరియు పట్టాదారు పాస్ పుస్తకం ఆధారంగా నేరుగా ఎరువులు పంపిణీ చేయాలి.

**సహాయ కేంద్రాలు:** ప్రతి మండల కేంద్రంలో మరియు ఎరువుల దుకాణాల వద్ద రైతులకు సహాయం చేయడానికి ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయాలి.

**సర్వర్ సామర్థ్యం:** సాంకేతిక లోపాలు తలెత్తకుండా సర్వర్ సామర్థ్యాన్ని పెంచాలి లేదా ఆఫ్‌లైన్ ద్వారా కూడా డేటా సేకరించే వీలు కల్పించాలి.

**అవగాహన సదస్సులు:** యాప్ వాడకంపై గ్రామ స్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలి. టెక్నాలజీ అనేది రైతులకు పని సులభం చేయాలి కానీ, వారిని ఇక్కట్ల పాలు చేయకూడదు. అధికారులు ఈ సమస్యలపై తక్షణమే సమీక్ష నిర్వహించి, రైతులకు సకాలంలో ఎరువులు అందేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నాం.లేనిపక్షంలో రైతుల పక్షాన ఆందోళనలు చేపట్టాల్సి వస్తుంది అని రాములు హెచ్చరించారు.



ఉట్కూరి రాములు

# దోమలు కుడితే కుట్టించుకోండి?

**జనాలు అల్లాడితే మాకేంటి?**

**గ్రామ పంచాయితీలకే పరిమితమైన దోమల స్ప్రే యంత్రాలు**

**జైపూర్ ప్రజలపై దోమల దళంతో రోజు జాతర**

**వాస్తవం : జైపూర్, ఫిబ్రవరి 22**

జైపూర్ మండల పరిధిలోని పలు గ్రామాలు ఈ మధ్యకాలంలో దోమల దండయాత్రతో వణుకుతున్నాయి. సాయంత్రం అయ్యే సరికి వీధులు వెలవెలబోతున్నాయి. బయట అడుగుపెడితే దోమల దాడి, ఇంట్లో కూర్చుంటే జ్వరాల భయం. చిన్నారుల నవ్వులు నిస్సత్తువగా మారాయి. వృద్ధుల నిద్రలేని రాత్రులు పెరిగాయి. గర్భిణీలు గుబులు గుబులు గుండెలతో రోజులు గడుపుతున్నారు. ఆరోగ్యంపై మబ్బులు కమ్ముకున్న వాతావరణం గ్రామ జీవనాన్ని గందరగోళంగా మార్చింది.ఇది ఒక్కరోజులో ఏర్పడిన సంక్షోభం కాదు. కాలువలు మూసుకుపోయి మురుగు నిల్వగా మారాయి. చెత్త కుప్పలు కొండలై నిలిచాయి. నీరు నిలిచిన ప్రతి గుంత దోమల జననానికి గర్భగుడిలా మారింది. సమస్య పెరిగేకొద్దీ ప్రజల ఆందోళన పెరిగింది. కానీ బాధ్యత వహించాల్సిన వారు మాత్రం మౌనవ్రతంలో ఉన్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.గ్రామ పంచాయితీ వద్ద స్ప్రే యంత్రాలు ఉన్నాయి. ఫాగింగ్ పరికరాలు ఉన్నాయి. అయితే అవి ప్రజల ఆరోగ్య రక్షణకు కాకుండా గిడ్డంగుల మూలల్లో విశ్రాంతి తీసుకుంటున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అన్నీ ఉన్నా ఉపయోగం లేకపోతే అది ఉన్నట్టే లేనట్టే కాదా అని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. సాధనాలు ఉన్నా సద్వినియోగం లేకపోతే అది పాలన వైఫల్యానికి ప్రతీకగా నిలుస్తుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.అధికార యంత్రాంగం స్పందన ఆలస్యం ప్రజల్లో ఆగ్రహాన్ని రగిలిస్తోంది. ఆరోగ్య భద్రత అనేది ప్రాధాన్య అంశం కావాలి. కానీ ఇక్కడ పరిస్థితి చూస్తే బాధ్యత బరువును భుజాలపై మోసే మనసు కనిపించడం లేదనే భావన కలుగుతోంది.

**వ్యాధులు వ్యాప్తి చెందక ముందే చర్యలు తీసుకోవాలి**

వ్యా ధులు పాకిన తర్వాత కదిలే వ్యవస్థ ప్రజలకు ఎంతవరకు ఉపయోగపడుతుంది అనే ప్రశ్న గాలిలో తేలుతోంది.ప్రజలు పన్నులు చెల్లిస్తున్నారు. వారు కోరేది విలాసవంతమైన సదుపాయాలు కాదు; కనీస ఆరోగ్య రక్షణ మాత్రమే. గ్రామపంచాయితీ సిబ్బంది ఇప్పటివరకు క్రమబద్ధమైన ఫాగింగ్ కార్యక్రమాలు నిర్వహించకపోవడం పరిపాలనా లోపమా లేక అలసత్వమా అన్న సందేహాలు బలపడుతున్నాయి. బాధ్యత అంటే పదవి కాదు; ప్రజల ప్రాణాలను కాపాడే ప్రతిజ్ఞ అని గుర్తుచేసే సమయం ఆసన్నమైంది. సమస్య పరిష్కారం కష్టం కాదు. వెంటనే ఫాగింగ్ చేపట్టాలి. నిల్వ నీటి ప్రాంతాలను గుర్తించి శుభ్రపరచాలి. కాలువల పరిశుభ్రతపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ఆరోగ్య శాఖతో సమన్వయం చేసి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి. ప్రజల్లో అవగాహన కల్పించాలి. ఇవన్నీ మాటల్లో కాదు, కార్యాచరణలో కనిపించాలి.ఇప్పటికైనా స్పందన



రాకపోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలనే ఆలోచన ప్రజల్లో బలపడుతోంది. ప్రజల ఆరోగ్యంపై నిర్లక్ష్యం కొనసాగితే ఉన్నతాధికారుల జోక్యం తప్పదని గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు. ఇది హెచ్చరిక మాత్రమే కాదు, పరిస్థితి తీవ్రతకు ప్రతిబింబం.దోమల సమస్య కేవలం ఒక గ్రామానికి పరిమితం కాదు. ఇది ప్రజా ఆరోగ్యానికి సంబంధించిన సామూహిక బాధ్యత. పాలన నిద్రలో ఉంటే ప్రజల జీవనం నిప్పులో పడుతుంది. అందుకే ఇప్పటికైనా మేల్కొని తక్షణ చర్యలు తీసుకోవాలి. ఆలస్యం మరింత ప్రమాదాన్ని ఆహ్వానిస్తుంది.జైపూర్ మండల ప్రజలు కోరేది ఒక్కటే. ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి. బాధ్యత గల పాలనను చూపించాలి. ప్రజల విశ్వాసం కోల్పోతే పదవులు అర్థహీనమవుతాయి. సమాజం మేల్కొంటేనే మార్పు సాధ్యం. పాలన స్పందిస్తేనే ప్రజల ప్రాణాలకు రక్షణ లభిస్తుంది.

జన్మదినోత్సవాలు, పదవీ విరమణ శుభాకాంక్షల
ప్రకటనల కోసం సంప్రదించండి
8074124190
వాస్తవం

# పథకం ప్రకారమే బొగ్గుల శ్రీనివాస్ హత్య

## కీలక విషయాలు వెలుగులోకి

**ఖమ్మం ఫిబ్రవరి 22 :**
ప్రముఖ రచయిత, సాహిత్య పరిశోధకుడు, యూట్యూబర్ బొగ్గుల శ్రీనివాస్(48)ని ఈనెల 14వ తేదీన ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని పాలేరు రిజర్వాయర్‌లో కారుతో సహా పడేశారు. ఈ విషయంపై అనుమానం వచ్చిన పోలీసులు దర్యాప్తు జరిపారు. పోలీసుల విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి ఈ కేసుకు సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించారు. మొదట ఈ ఘటనను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం జరిగినప్పటికీ, పోలీసుల సమగ్ర దర్యాప్తులో ఇది పథకం ప్రకారం జరిగిన హత్యగా వెలుగులోకి వచ్చింది. ఏపీలోని నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలంలోని అల్లూరుకు చెందిన బొగ్గుల శ్రీనివాస్.. 20 ఏళ్లుగా హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. జీఎస్టీకి సంబంధించిన ఆర్థిక లావాదేవీలు ఈ హత్యకు ప్రధాన కారణమని ఏసీపీ తిరుపతిరెడ్డి వెల్లడించారు. మొదట ప్రమాదంలా కనిపించిన ఈ ఘటన వెనుక కుట్ర ఉందనే అనుమానం వచ్చిందన్నారు. మృతదేహంపై గాయాలు, కారులో రక్తపు మరకలు, సంఘటనా స్థలంలో లభించిన ఇతర ఆధారాలు కేసును ఛేదించేందుకు సహకరించాయని చెప్పారు. బొగ్గుల శ్రీనివాస్‌కు వ్యాపార, ఆర్థిక వ్యవహారాలపై వివాదాలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా జీఎస్టీ లావాదేవీల్లో పెండింగ్‌లో ఉన్న డబ్బుల విషయమై కొందరు వ్యక్తులతో ఆయనకు విభేదాలు ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఇదే అంశాన్ని ఆధారంగా చేసుకుని నిందితులు హత్యకు పథకం రచించారు.
ఈ కేసులో మొత్తం నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో ఏ1గా మేకల వేణుమాధవరెడ్డి పేరు వెలుగులోకి వచ్చింది. బొగ్గుల శ్రీనివాస్‌కు సన్నిహితుడిగా ఉన్న అతడు రూ.5 లక్షల సుపారీ ఇచ్చి ముగ్గురు వ్యక్తులతో ఈ హత్య చేయించినట్లు పోలీసులు వెల్లడించారు.పోలీసుల కథనం మేరకు.. పెండింగ్‌లో ఉన్న డబ్బులు ఇస్తామని నమ్మబలికి శ్రీనివాస్‌ను కారులో ఎక్కించుకుని తీసుకెళ్లారు. ముందుగా సిద్ధం చేసుకున్న ప్రదేశంలో కత్తులు, ఐరన్ రాడ్లతో దాడి చేసి హత్య చేశారు. పోలీసుల దర్యాప్తులో జీఎస్టీకి సంబంధించిన ఆర్థిక వివాదాలే హత్యకు దారి తీసినట్లు తేలింది. పెండింగ్‌లో ఉన్న డబ్బుల వ్యవహారం, వ్యాపార ఒత్తిడి, పరస్పర అనుమానాలు.. చివరకు ఈ దారుణానికి దారి తీసినట్లు పేర్కొన్నారు. నిందితులు ముందుగానే హత్యకు ప్రణాళిక రచించి, శ్రీనివాస్‌ను ఒంటరిగా కారులో తీసుకెళ్లి దారుణంగా హత్య చేసినట్లు వెల్లడించారు.ఈ ఘటన ఈ నెల 14వ తేదీ తెల్లవారుజామున నకిరేకల్ సమీపంలో జరిగినట్లు తెలిపారు. హత్య అనంతరం మృతదేహాన్ని




కారుతో పాటు పాలేరు రిజర్వాయర్‌లో పడేసి ప్రమాదంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించారు. కారును నీటిలోకి తోసేసి, అది ప్రమాదవశాత్తు జరిగినట్లుగా నమ్మించే ప్రయత్నం చేసినట్లు దర్యాప్తులో బయటపడింది. అయితే, మృతదేహంపై గాయాలు ఉండటంతో కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగి దర్యాప్తు జరిపారు. కాల్ డేటా, ఆర్థిక లావాదేవీలు, సీసీటీవీ ఫుటేజ్ వంటి ఆధారాలను పరిశీలించారు. పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ జరిపినప్పుడు హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చాయి.పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. మరిన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని, అవసరమైతే అదనపు వివరాలు వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.

---

### మృతుని కుటుంబానికి

# ఆర్థిక సహాయం



**మార్కుక్ : వాస్తవం :**
మండల పరిధిలోని పాములపర్తి గ్రామానికి చెందిన దేగల బాలమల్లు(55) గ్రామంలో పారిశుద్ధ్య కార్మికుడిగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో బాధపడుతూ గత వారం రోజుల క్రితం మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామ నూతన పాలకవర్గం సర్పంచ్ భవాని బాలకిషన్ ఉప సర్పంచ్ జుట్టు సుధాకర్ వార్డు సభ్యులతో కలిసి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి 21000/-వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. పరామర్శించిన వారిలో సభ్యులు నీరుడి రాజు, కొండని కరుణాకర్ , మ్యాకల శ్రీనివాస్, బోయిని మల్లేష్, దండు కరుణాకర్, చెక్కల వరలక్ష్మి స్వామి, ఊళ్లే లావణ్య యాదగిరి తదితరులు ఉన్నారు.




# అధికారమిచ్చిన భూపాలపల్లి ప్రజల రుణం తీర్చుకుంటాం

### మున్సిపల్ చైర్మన్‌గా పదవీ బాధ్యత స్వీకరించిన బుర్ర కొమురయ్య గౌడ్

**వాస్తవం : భూపాలపల్లి**
భూపాలపల్లి మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ సిపిఐ సిపిఎం లతో కలిసి విజయం సాధించినందుకు హనుమాన్ టెంపుల్ నుండి మున్సిపల్ కార్యాలయం వరకు విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. అనంతరం విజయోత్సవ సభలో శాసనసభ్యులు గండ్ర సత్యనా రాయణ రావు ప్రజలందరికీ అభివాదం చేస్తూ ప్రజాపాలనకు మద్ద తిచ్చి ప్రజ లంతా కాంగ్రెస్ పార్టీని ఆదరించి మున్సిపల్ ఎన్నికల్లో మా కౌన్సిలర్లను గెలిపించినందుకు ప్రతి ఒక్కరికి ధన్య వాదాలు తెలియజేస్తూ, అందరికీ రుణ పడి ఉన్నామన్నారు. అవినీతికితావు లేని మచ్చలేని పరిపాలనను చేసి చూపుతామని తెలంగాణ రాష్ట్రంలోనే భూపాల పల్లిని అభివృద్ధి చేసి తీరుతామన్నారు. పదవి బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్ మరియు వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్‌లను అభినందించి మీ అవసరాలు తీర్చే సారధులుగా ముందుకు నడిపిస్తానన్నారు. ప్రజలందరికీ



అందుబాటులో ఉంటూ పట్టణాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తా రని ప్రతి వార్డులో ఏ ఏ సమస్యలు ఉన్నాయో తెలుసుకొని సత్వరమే వాటిని పరిష్కరించి పట్టణ అభివృద్ధికి పాటు పడేలా చూసుకుంటానని అదేవిధంగా అన్ని విధాల సహాయ సహకారాలను అందించిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ రానున్న కాలంలో కాంగ్రెస్ పార్టీకి మంచి పేరు తీసుకురావడం కోసం కష్టపడాల్సిన బాధ్యత కౌన్సిలర్ది మరియు కార్యకర్తలది అని తెలిపారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరిస్తున్న బుర్ర కొమరయ్య గౌడ్ మమ్మల్ని ఆదరించి గెలిపించిన వారందరికీ మా వెంటుండి నడిపించిన నాయకులకి కార్యకర్తలకి సత్తన్న అభిమానులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తూ మీకు అన్ని విధాలుగా



అందుబాటులో ఉంటూ సైనికుడిలా పనిచేస్తామని ప్రతి వార్డు అభివృద్ధికి తోడుంటామని అవినీతి లంచగొండితనం లేకుండా సేవలు అందిస్తామని అవినీతికి పాల్పడితే, గుర్తించి ముక్కును నేలకు రాపించే అధికారం కూడా ప్రజలదే అని మాట ఇచ్చారు.



# పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ధ్యేయం

**దామరకుంటలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం ప్రారంభించిన గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి**

**మార్కుక్ : వాస్తవం :**
పేదవారి సొంతింటి కలను నిజం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. మార్కుక్ మండల పరిధిలోని దామరకుంట గ్రామంలో ఇందిరమ్మ పథకంలో భాగంగా చాకలి కవిత ఎల్లం నిర్మించుకున్న నూతన గృహాన్ని ఆది వారం ఆయన గ్రామ సర్పంచ్ పత్తి నర్సింలు యాదవ్, లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద ప్రజలకు భద్రత కలిగిన నివాసం కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత విద్యుత్, ఉచిత బస్ ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ వంటి సంక్షేమ పథకాలు గ్రామీణ ప్రజలకు మేలు చేస్తున్నాయని తెలిపారు.గత ప్రభుత్వం ఈ ప్రాంతానికి తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని, అర్హులైన వారికి రేషన్ కార్డులు, ఇళ్లు అందలేదని విమర్శించారు. ఏప్రిల్ నెలలో రెండో విడతలో మరిన్ని అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరు చేసి నిర్మాణాలు చేపడతామని హామీ ఇచ్చారు.ప్రజల అభ్యున్నతికి కట్టుబడి పనిచేస్తున్న ఈ ప్రభుత్వానికి ప్రజల



ఆశీర్వాదాలు అవసరమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

# నేడు యథావిధిగా ప్రజావాణి



**జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**వాస్తవం: రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)**
ప్రజల సమస్యల సత్వర పరిష్కారం కోసం రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం నుంచి ప్రజావాణి కార్యక్రమాన్ని యథావిధిగా కొనసాగించనున్నట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ ఎన్నికలు, మహాశివరాత్రి జాతర మహోత్సవాల దృష్ట్యా ప్రజావాణి కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**అఖిల భారత విద్యార్థి సమాఖ్య**

# రాష్ట్ర రథసారథిగా పుట్ట లక్ష్మణ్



**మేడిపల్లి : వాస్తవం :** ఫిబ్రవరి 18,19, 20 తేదీలలో నిజామాబాద్ పట్టణంలో రాష్ట్ర మహాసభలు ఘనంగా జరిగాయి. సభలో 33 జిల్లాల నుండి 750 మంది విద్యార్థి ప్రతినిధులు హాజరయ్యారు. సభలో నూతన రాష్ట్ర కౌన్సిల్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహాసభల్లో సంఘం యొక్క రాష్ట్ర సారథిగా (కార్యదర్శి) బోడుప్పల్ సర్కిల్, పీర్జాదిగూడ డివిజన్కి చెందిన పుట్ట లక్ష్మణ్ని నూతన కౌన్సిల్ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. విద్యార్థుల హక్కుల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత విస్తరించనున్నామని, ప్రతి విద్యా సంస్థలో ఏఐఎస్ఎఫ్ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. విద్యను కార్పొరేటీకరణ చేయాలనే ప్రయత్నాలను తీవ్రంగా ప్రతిఘటిస్తామని పుట్ట లక్ష్మణ్ స్పష్టం చేశారు.

# ‘డ్రగ్స్ వద్దు ..పుస్తకాలే ముద్దు’

**శాంతివనం రన్నర్స్ ఆధ్వర్యంలో అవగాహన రన్**



**మేడిపల్లి : వాస్తవం :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నారాపల్లి నందనవనంలో శాంతివనం రన్నర్స్, మేడిపల్లి ఆధ్వర్యంలో యువతలో మత్తు పదార్థాలపై చైతన్యం కల్పించేందుకు నిర్వహించిన అవగాహన రన్ కార్యక్రమాన్ని మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. $16_{K}$, $10_{K}$, $5_{K}$ మరియు $3_{K}$ విభాగాల్లో నిర్వహించిన ఈ రన్లో వందలాది మంది యువత, విద్యార్థులు, మహిళలు, ఫిట్నెస్ అభిమానం కలిగిన వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. ‘డ్రగ్స్ వద్దు – పుస్తకాలే ముద్దు’ అనే నినాదాలతో డ్రగ్స్కు వ్యతిరేకంగా గళమెత్తారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, డ్రగ్స్ అనే సామాజిక వ్యాధి యువత భవిష్యత్తును దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని, ప్రతి కుటుంబం ఈ పోరాటంలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. అనంతరం పాల్గొన్న రన్నర్లకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు.సీఐ మక్బూల్ జాని మాట్లాడుతూ, మత్తు పదార్థాల వినియోగం చట్టరీత్యా నేరమని, యువత దూరంగా ఉండాలని సూచించారు.అనుమానాస్పద కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్.వి ఫౌండేషన్ తుంగతుర్తి రవి, వాకిటి శ్రీకాంత్ రెడ్డి నిర్వాహకులు సోమశేఖర్, శేఖర్ , స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.

**అపూర్వ కలయిక**

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**వాస్తవం -ముప్కాల్**
ముప్కాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు 2003-04 పదోతరగతి బ్యాచ్ విద్యార్థిని విద్యార్థులు ఆదివారం రోజు స్థానిక పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నారు. కార్యక్రమంలో భాగంగా ఆనాటి గురువులను ఘనంగా సన్మానించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ సంతోష సాగరంలో మునుగుతూ ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఆనాటి గురువులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధే ధ్యేయం

**చిన్న మిడిసిలేరు సర్పంచ్ శ్యామల సీత**

**సొంత డబ్బులతో పనులకు శ్రీకారం**

**చర్ల : వాస్తవం**
కొత్తగా కొలువుతీరిన చిన్న ముడిసిలేరు సర్పంచ్ శ్యామల సీత తమ సొంత డబ్బులతో గ్రామాల్లో పనులకు శ్రీకారం చుట్టారు. కొన్ని నెలలుగా ప్రత్యేక అధికారులతో అంతంత మాత్రాన పరిపాలన సాగగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన సర్పంచ్ గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. చెడిపోయిన రోడ్ల తాత్కాలిక మరమ్మత్తులు, అలాగే మురుగు కాలువల శుభ్రం, వీధి దీపాల మరమ్మత్తులు తదితర పనులు చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు.ప్రభుత్వం నుండి సకాలంలో నిధులు రాకపోవడంతో, గ్రామాభివృద్ధిని ఆపకూడదనే ఉద్దేశ్యంతో తమ సొంత ఖర్చులతో పనులు చేపడుతున్నారు. చర్ల మండల పరిధిలోని చిన్న ముసిలేరు గ్రామ సర్పంచ్ శ్యామల సీత తన సొంత ఖర్చులతో మారుమూల అడవి ప్రాంతమైన తిమ్మిర్రి గూడెంలో గతంలో ఐటీడీఏ ద్వారా నిర్మించిన సోలార్ మోటార్ పంప్ సెట్ చెడిపోవటంతో ఆ గిరిజనుల త్రాగునీటి అవస్థలు చూడలేక తన సొంత ఖర్చులతో, బోరు పంపులు బాగు చేయించి, కొత్త కరెంటు మోటార్ కొని నీటి సమస్యతో బాధపడుతున్న ఆ గ్రామానికి నీటి వసతులు కల్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ సీత మాట్లాడుతూ గ్రామ అభి



వృద్దే ధ్యేయంగా పనిచేస్తామని, గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని, అవినీతికి తావులేకుండా పారదర్శక పాలన అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ, గ్రామస్తులు పాల్గొన్నారు.






# బాక్సింగ్‌లో

# రజత పతకం సాధించిన 'గ్రామ ముద్దుబిడ్డ'

**ఏఆర్ కానిస్టేబుల్ గడ్డం హరీష్‌కు ఘన సన్మానం**

**వాస్తవం : ఎల్కతుర్తి**

తెలంగాణ రాష్ట్ర 4వ స్థాయి పోలీస్ స్పోర్ట్స్ మీట్ బాక్సింగ్ విభాగంలో రజత పతకం సాధించి, రాష్ట్ర స్థాయిలో గ్రామానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చిన ఏఆర్ కానిస్టేబుల్ గడ్డం హరీష్‌ను ఆయన సొంత గ్రామమైన ఎల్కతుర్తి మండలం లోని వీరనారాయణపూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ పుల్లూరి శ్రీధర్ రావు ఘనంగా సన్మానించారు. పోలీస్ శాఖ నిర్వహించిన ప్రతిష్టాత్మక క్రీడల్లో బాక్సింగ్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించి, తొలిసారిగా గ్రామానికి విచ్చేసిన హరీష్‌కు గ్రామ సరిహద్దుల్లో యువకులు, పెద్దలు ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు ఆయనను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పుల్లూరి శ్రీధర్ రావు మాట్లాడుతూ.. "మా ఊరి బిడ్డ పోలీస్ శాఖలో బాధ్యతలు నిర్వహిస్తూనే, క్రీడల్లో రాష్ట్ర స్థాయిలో పతకం సాధించడం మా అందరికీ గర్వకారణం. హరీష్ సాధించిన ఈ విజయం గ్రామంలోని యువతకు, విద్యార్థులకు గొప్ప స్ఫూర్తినిస్తుంది," అని కొనియాడారు. సన్మానం అనంతరం హరీష్ భావోద్వేగంతో మాట్లాడుతూ.. "నేను ఈ స్థాయికి చేరడానికి నా గ్రామం, ఇక్కడి మట్టి అందించిన ప్రోత్సాహమే కారణం. బాక్సింగ్ రింగ్‌లో నేను వేసిన ప్రతి పంచ్ వెనుక మా గ్రామస్తుల దీవెనలు ఉన్నాయి. భవిష్యత్తులో జాతీయ స్థాయిలో స్వర్ణ పతకం సాధించి మన గ్రామం పేరును దేశవ్యాప్తంగా చాటుతాను," అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, యువజన సంఘాల , మరియు హరీష్ కుటుంబ సభ్యులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







# ఎర్రవల్లిలో

# గోటి తలంబ్రాల దీక్షకు పిలుపు

**మార్కుక్:వాస్తవం :**

శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో జరిగే సీతారాముల కళ్యాణానికి వినియోగించే గోటి తలంబ్రాల దీక్ష కార్యక్రమం మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామంలో శనివారం హనుమాన్ దేవాలయం నుంచి ప్రారంభం కానుందని శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు తెలిపారు. ఆదివారం ఎర్రవల్లి హనుమాన్ దేవాలయంలో శ్రీరామాంజనేయ భక్తులతో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగోసారి 3 క్వింటాళ్ల గోటి తలంబ్రాలను కళ్యాణానికి సమర్పించే భాగ్యం దక్కిందన్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రామభక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. గోటి తలంబ్రాల్లో పాల్గొనడం ఎన్నో జన్మల పుణ్యఫలమని భక్తులు పేర్కొన్నారు. స్త్రీ, పురుష భేదం లేకుండా అందరూ పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నారన్న గారి కవిత రామ్మోహన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, పండరి, మహిపాల్ రెడ్డి మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీఆంజనేయ స్వామి

# దేవాలయ నిర్మాణానికి భూమి పూజ



**వాస్తవం :సంగారెడ్డి జిల్లా ప్రతినిధి :** పటాన్చెరువు నియోజకవర్గం పరిధిలో 271 డివిజన్ గండిగూడెం కాలనీలో నిర్వహిస్తున్న ఆంజనేయస్వామి దేవాలయ భూమి పూజలో బీఆర్ఎస్ నాయకులు ఐలాపూర్ మాణిక్ యాదవ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుల్తాన్‌పూర్ కటకం శివ రాజుతోపాటు కాలనీ యువకులు, పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక భక్తులతో కలిసి స్వామివారి ఆశీస్సులు పొందారు.

# విశ్వ భారతి లా కాలేజీలో

# ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

**న్యాయవాదులు సేవాభావంతో పనిచేయాలి**

**ఓయూ లా డీన్ ప్రొఫెసర్ వెంకటేశ్వరులు**

**వాస్తవం : శేరిలింగంపల్లి :**




నేటి ఆధునిక కాలంలో ఎదురవుతున్న సవాళ్లను, ముఖ్యంగా కృత్రిమ మేధ (ఏఐ) వంటి సాంకేతిక మార్పులను తట్టుకుని నిలబడేలా విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఓయూ లా కాలేజ్ డీన్, హెచ్ఓడీ ప్రొఫెసర్ ఎన్. వెంకటేశ్వరులు పిలుపునిచ్చారు. పటాన్‌చెరు మండలం ముత్తంగిలోని విశ్వ భారతి కాలేజ్ ఆఫ్ లా ఆధ్వర్యంలో నిర్వహించిన 2026 గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వెంకటేశ్వరులు మాట్లాడుతూ.. న్యాయవాదులు క్లయింట్ల పట్ల గౌరవంతో మెలగాలని, వారి సమస్యలను ఓపికగా వినాలని సూచించారు. న్యాయ వృత్తిలో రాణించాలంటే నిరంతర అధ్యయనం అవసరమని, రోజుకు 18 గంటల పాటు కష్టపడేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. వృత్తిని కేవలం ధనార్జన కోసం కాకుండా, సామాజిక బాధ్యతగా భావించి సేవ చేయాలని ఆయన హితవు పలికారు. 2022--2025 విద్యా సంవత్సరంలో న్యాయవిద్య పూర్తి చేసిన 150 మంది విద్యార్థులకు ఈ కార్యక్రమంలో పట్టాలను అందజేశారు. గౌరవ అతిథి ప్రొఫెసర్ డా. విజయలక్ష్మి మాట్లాడుతూ.. విద్యార్థులు తమ కెరీర్‌ను అభివృద్ధి చేసుకుంటూనే సమాజానికి సేవ చేయాలని, తద్వారా విద్యాసంస్థల గౌరవాన్ని పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు "అనంత రాజమ్మ స్మారక అవార్డులను" అందజేశారు. శృతి మండా: గోల్డ్ మెడల్ (బంగారు పతకం). శైలజ కొండాపురం: సిల్వర్ మెడల్ (వెండి పతకం). కళాశాల కరస్పాండెంట్ రవి అనంత, ప్రిన్సిపాల్ డాక్టర్ భవాని సమక్షంలో విజేతలకు మెడల్స్ అందజేశారు. ఈ వేడుకలో అధ్యాపకులు గురుమూర్తి, తేజస్రీ, కీర్తి, రమ్యశ్రీతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**లగిశెట్టి అఖిల- శ్రీనివాస్‌లను**

# ఆశీర్వదించిన కౌశిక్ హరి



**వాస్తవం : రామగుండం రూరల్**

పెద్ద పల్లి జిల్లాఅంతర్గాం మండలం మద్దిర్యాల గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ లాగిశెట్టి సునీత– తిరుపతి దంపతుల కుమార్తె అఖిల– శ్రీనివాస్ దంపతుల నిశ్చితార్థ మహోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన కార్మిక నేత, బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కౌశిక హరి వధూవరులకు అక్షింతలు వేసి వారిని ఆశీర్వదించారు .ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు అర్జనపల్లి రాజు, గాలెంకి ప్రసాద్, మద్దికుంట శంకర్, సాగర్ ,భూ పెల్లి ప్రసాద్, రాజిరెడ్డి ,రాజేందర్ ,నరేష్, చుక్కయ్య ,ప్రశాంత్ గౌడ్ , బరు పట్టి తిరుపతి పాల్గొన్నారు.

జన్మదినోత్సవాలు, పదవీ విరమణ శుభాకాంక్షల
ప్రకటనల కోసం సంప్రదించండి
8074124190
వాస్తవం

## భగవంతుడిని తెలుసుకోవాలంటే
# హరినామ సంకీర్తనమే మార్గం

**వాస్తవం : సంగారెడ్డి జిల్లా ప్రతినిధి**



సర్వచరాచర జగత్తును నడిపిస్తున్న అతీంద్రియమైన శక్తిని తెలుసుకోవడానికి హరినామ సంకీర్తన ద్వారానే సాధ్య పడుతుందని సంగారెడ్డి జిల్లా కంది హరేకృష్ణ టెంపుల్ బాధ్యులు శ్రీ విభీషణ్ ప్రభుజీ వ్యాఖ్యానించారు. భగవంతుని గురించి కనుగొనడం మానేసి భగవంతుని గురించి తెలుసుకోవాలని సూచించారు. ఆదివారం స్థానిక పోచమ్మ ఆలయ ప్రాంగణంలో హరేకృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో 195 వ నగర సంకీర్తన అట్టహాసంగా జరిగింది. ప్రతినిత్యం హరినామ సంకీర్తన చేయడం, నిత్య ఆరాధన, భోగ సమర్పణ సద్భక్త గుణ గణాలు కలిగి ఉండడం భగవంతునికి దగ్గరగా చేస్తాయన్నారు. ఈ సందర్భంగా భగవద్గీత రెండవ అధ్యాయంలోని శ్లోకాలను ఉటంకిస్తూ పలు ఉపమానాలను వివరించారు. అంతకుముందు రానున్న హోళీ పండుగను దృష్టిలో పెట్టుకొని ముందస్తు హోళీ వేడుకలను సంకీర్తన బృందం ఘనంగా జరుపుకోంది. ఒకరిపై ఒకరు పుష్పాలను వెదజల్లుతూ హోళీ సంబరాలను వైభవంగా జరుపుకొన్నారు. హోళీ వేడుకలకు సంబంధించి బృందావన్, బరసానాలో జరిగే పాటలను పాడుతూ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఈ సందర్భంగా గోప గోపికలు, రాధాకృష్ణుల రాసలీలలు, నంద యశోదా అల్లరి కీర్తనలు భక్తులను మంత్ర ముగ్ధలను చేశాయి. తన్మయత్వం చెందిన భక్తులు ఆనందంతో నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా గడిపారు. అనంతరం నరసింహ ఆరతి ముగించి వివాహ వార్షికోత్సవాలు, జన్మదినోత్సవాలు జరుపుకొంటున్న భక్తులకు శుభాశీస్సులు అందజేశారు.

## నూతన వధూవరులకు ఆశీర్వాదం



**వాస్తవం:మోత్కూరు :**

మోత్కూరు పట్టణ కాంగ్రెస్ నాయకులు కోమటి జనార్ధన్ ఝాన్సీల వివాహం సందర్భంగా ఆదివారం నూతన వధూవరులను ఆశీర్వదించిన జిల్లా కాంగ్రెస్ నాయకులు గుర్రం లక్ష్మీ నరసింహ రెడ్డి, మోత్కూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గుండగోని రామచంద్రు గౌడ్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పురుగుల నర్సింహ్ యాదవ్ ,యూత్ కాంగ్రెస్ జిల్లా మాజీ కార్యదర్శి మందుల సురేష్, బయ్యని రాజు, ఉయ్యాల అంజయ్య, పొల్నెని స్వామి రాయుడు, కళ్లెం నరసింహ , మురళి తదితరులు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో ఆది శ్రీనివాస్



**వాస్తవం: వేములవాడ**

వేములవాడ పట్టణ పరిధిలోని 13 వ వార్డు కోనయపల్లి లో ఆదివారం నిర్వహించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారికి నూతన వస్త్రాలు అందజేశారు.ప్రభుత్వం పేద ప్రజలకు గృహ స్వప్నాన్ని నెరవేర్చే లక్ష్యంతో చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా అనేక కుటుంబాలు సొంతింటి సంతోషాన్ని పొందుతున్నాయని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ నీలమ్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఇండ్లు కూల్చడం అంటే
# పేదల బతుకులను కూల్చడమే

**ముఖ్యమంత్రి రియల్ ఎస్టేట్ రాజకీయాలు మానుకోవాలి : హరీష్ రావు**

**వాస్తవం : రాజేంద్రనగర్**

ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న ప్రజల ఇండ్లను కూల్చడం అంటే వారి బతుకులు కూల్చడమే అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఆదివారం మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు పేరుతో ఇండ్లు కోల్పోతున్న మధు పార్క్ అపార్ట్మెంట్ బాధిత కుటుంబాలను హరీశ్ రావు, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఇంఛార్జి కార్తీక్ రెడ్డి తదితరులు కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ... అహింస వాది విగ్రహం పేరుతో ప్రజలను హింసించడం వారిని భయభ్రాంతులకు గురి చేయడం ఏ చట్టంలో ఉందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రేవంత్ వేసే ప్రతి అడుగు వెనుక భూ కబ్జాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారమే ఉంటుందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్ రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. పేదలకు డబ్బులు లేవని చెప్పే ముఖ్యమంత్రికి క్యాంపు ఆఫీసులకు వందల కోట్లలో పైసలు ఎక్కడి నుండి వస్తున్నాయని ప్రశ్నించారు. హైదర్షా కోట్ లో మూసీ బాధిత కుటుంబాలకు భరోసాగా ఉంటామని హామీ ఇచ్చారు. కేసీఆర్‌కు మధు పార్క్ అపార్ట్మెంట్‌తో మర్చిపోలేని అనుబంధం ఉందని హరీశ్‌రావు గుర్తు చేశారు.



కేసీఆర్ ఈ అపార్ట్మెంట్‌కు మూడు సార్లు వచ్చారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ పాలసీ విజన్ డాక్యుమెంట్‌ను ఇక్కడి వార్ రూముల్లో కూర్చునే తయారు చేశారని చెప్పుకొచ్చారు. అసెంబ్లీ సమావేశాలలో అపార్ట్మెంట్ వాసుల తరపున తాము ప్రభుత్వాన్ని నిలదీస్తామని హరీశ్ రావు పేర్కొన్నారు. సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ...అవసరంలేని పనులను చేస్తూ ప్రజలను ప్రభుత్వం భయభ్రాంతులకు గురిచేస్తూ పైశాచిక ఆనందం పొందుతుందని మండిపడ్డారు. మధు పార్క్ అపార్ట్మెంట్ వాసులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.




## ప్రజల ఇబ్బందులు అర్థం చేసుకోండి
**నవీన్ పోగుల**



**వాస్తవం : జూబ్లీహిల్స్**

తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇంచార్జ్, కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ ఆదేశాల మేరకు, యూసఫ్ గూడా( డివిజన్ )బస్తీలో గత రెండు వారాలకు పైగా సగంలో ఆగిపోయినటువంటి నూతన డ్రైనేజ్ పనుల వలన స్థానికులు ఎదుర్కొంటున్నటువంటి సమస్యలను జలమండలి ఉన్నత అధికారుల దృష్టికి వినతి పత్రంగా సమర్పించి తీసుకెళ్లా మని తెలిపారు బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నవీన్ పోగుల.నవీన్ పోగుల మాట్లాడుతూ ఈ రోడ్డు వలన స్థానికులు నడవడానికి, వాహనములు వెళ్లడానికి అలాగే ఏదైనా అత్యవసర పరిస్థితులలో కనీసం ఆటో కూడా వెళ్లలేని పరిస్థితి ఉంది, దీనివలన ముఖ్యంగా పిల్లలు రాత్రి పూట పడి గాయాల పాలవుతున్నారూ. ప్రజల ఇబ్బం దులను దృష్టిలో ఉంచు కొని సమస్య తీవ్రతను అర్థం చేసుకొ ని సత్వరమే నూతన డ్రైనేజీ పనులు పూర్తి చేయాలని సం బంధిత జలమండలి ఉన్నత అధికారులకు విజ్ఞప్తి చేస్తు న్నానని అన్నారు ప్రజల స్థానిక సమస్యలను పరిష్కరించ డానికి ఎల్లప్పుడూ ముందు ఉంటాను అని అన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు ఇంద్రాణి, ప్రసాద్ చౌదరి పాల్గొన్నారు.

## పేదవారికి రంజాన్ కిరాణా కిట్ల పంపిణీ

**డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఫయాజ్**

**వాస్తవం : శేర్లింగంపల్లి**

శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని హైదర్నగర్‌లో ఆదివారం సాయంత్రం రంజాన్ మాసంలో ఉపవాసంలో ఉన్న వారితో పాటు నిరుపేదలకు రంజాన్ కిట్లను మసీదు సమీపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అక్కడికి వచ్చిన పలువురికి అందించడం తన కెంతో ఆనందంగా ఉందని అన్నారు. కాంగ్రెస్ హైదర్ నగర్ డివిజన్ అధ్యక్షుడు, కాంగ్రెస్ లేబర్ సేల్ హైదర్ నగర్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉచిత రంజాన్ కిట్ల పంపిణీ కార్యక్రమం విజయ వంతం కావడానికి నాకు సహకరిం చిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.ఏడాదిలో ఇ




లాంటి కార్యక్రమాలు సమాజంలో తన వంతు కొంతైనా సహాయం చేయ డానికి ముందుకు వస్తున్న తనకు ప్రతి ఒక్కరి ఆశీస్సులు ఉండాలని ఆయన మీడియాతో తెలిపారు.

# స్వీయ ప్రయోజనమా? ప్రజా ప్రయోజనమా?

## ఏది పాఠకులకు ముఖ్యం?

కే.ఆర్ 'శైలి'
పాత్రికేయపాఠం 23.02.2026
......................

కొత్తగా, వింతగా, ఆసక్తికరంగా ఉండే తాజా సమాచారమే వార్త. ఈ తాజా సమాచారంలో ప్రజాప్రయోజనం ఉంటే మరింత మంచిది. వార్తలు రాయాలంటే సాధన ఉండాలి. వార్తలు రాయలనుకునే వారు ముందుగా మంచి పాఠకుడై ఉండాలి. ఏం జరిగింది? ఎక్కడ జరిగింది? ఎప్పుడు జరిగింది? ఎవరికి జరిగింది? ఎలా జరిగింది? ఎందుకు జరిగింది? ఈ ప్రశ్నలకు సమాధానమే వార్త. మరి ఈ ప్రశ్నలకు జవాబులను క్రమపద్ధతిలో కూర్చి అందించినప్పుడే పాఠకుడు ఎలాంటి ఇబ్బంది పడకుండా వార్తను అర్థం చేసుకోగలడు. సమాచారాన్ని తెలుసుకోగలడు. లేదంటే మనం ఇచ్చే సమాచారం అస్పష్టంగా, అర్థ రహితంగా ఉంటే పాఠకులు అలాంటి సమాచారాన్ని అసలు స్వీకరించరు. ముఖ్యంగా ఇటీవల సామాజిక మాధ్యమాల ప్రాభవం బాగా పెరిగిన తర్వాత ప్రతీ అంశం వార్తగా పరిగణిస్తూ పత్రికలు ప్రచురిస్తున్నాయి. ఇలా ప్రచురించే విషయాల్లో పైన చెప్పుకున్నట్లు ఆసక్తికరమేమీ ఉండటం లేదు. తాజాదనం అంతకన్నా అసలు ఉండటం లేదు. అన్నింటికన్నా ముఖ్యంగా ప్రజా ప్రయోజనం అసలే కన్పించడం లేదు.. ఉన్నదల్లా స్వీయ ప్రయోజనమే. ఇలాంటి సందర్భాల్లో వార్తలను సేకరించే క్రమంలో విలేకర్లు జాగ్రత్త వహించాలి. నేతలు తమ తమ కార్యక్రమ వివరాలను వారే స్వయంగా పిఆర్‌ఒల ద్వారా పత్రికలకు సమాచారాన్ని పంపిస్తున్నారు. ఇలా అందిన సమారారం ప్రచురించ దగినదైతే మాత్రమే ప్రచురణకు తీసుకోవాలి. ఎందుకంటే ఇలా పంపించే సమాచారంలో అధికభాగం స్వీయప్రయోజనం మాత్రమే కన్పిస్తోంది. ఉదాహరణకు మాజీ సీఎం కేసీఆర్ మళ్లీ సీఎం కావాలంటూ శ్రీవారి దర్శనం చేసుకున్న ఫలానా నేత అంటూ ఇటీవల తరచూ వార్తలు కన్పిస్తున్నాయి. అలాగే అధికార పక్ష నేతలు రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా యాదాద్రిలో ప్రత్యేక పూజలు చేసిన ఫలానా నేత అంటూ విరివిగా వార్తలు కన్పిస్తున్నాయి. నిజానికి ఇందులో ప్రజలకు ఉపయోగపడే సమాచారం కానీ ఉపయోగపడే కార్యక్రమం కానీ ఏమీ లేదు. మరి అలాంటప్పుడు వార్తగా ప్రచురించాలా? వద్దా ? అనే సందేహం ఉంటుంది. ప్రజాప్రయోజనం అనే కోణంలో ఈ సమాచారాన్ని వార్తగా ప్రచురించాల్సిన అవసరం ఎంతమాత్రం ఉండదు. నేతకు స్వీయ ప్రయోజనమో లేదా ఆ వార్తను ప్రచురించినందుకు పత్రికకు ప్రకటనల రూపంలో ప్రయోజనమో లేక ఇతరత్రా స్వీయ ప్రయోజనాల్లో ఉంటే అది వార్తగా మారక తప్పదు. పత్రికకు స్వీయ ప్రయోజన వార్తలు ముఖ్యమా? లేక ప్రజాప్రయోజన వార్తలు ముఖ్యమా అన్నది ఆయా పత్రికల ఇష్టాఇష్టాల మీద ఆధారపడి ఉంటుంది. అయితే స్వీయ ప్రయోజన వార్తల ప్రచురణ కన్నా ప్రజాప్రయోజన వార్తల ప్రచురణ మీదనే ఆయా పత్రికల ప్రతిష్ట పాఠకుల్లో ఇనుమడిస్తుంది. ఈ విషయం అత్యత ముఖ్యమైనది. పత్రికలు సుదీర్ఘకాలంపాటు పాఠకుల మదిలో చెక్కు చెదరకుండా తమ ముద్రను నిలబెట్టుకోవాలంటే కొన్ని విషయాలపై కఠినంగా నిక్కచ్చిగా ఉండాల్సిందే. ఎందుకంటే పాఠకుల విశ్వసనీయత, ఆదరణ మీదనే ఏ పత్రికలైనా, మీడియానైనా నిలబడుతుంది. అలాంటి పునాదులను తమకు తామే నిర్వీర్యం చేసుకుంటే తాము ఎంతో కష్టపడి సాధించుకున్న పత్రికా సౌధం నేలకూలకమానదు.

### స్పాట్‌కు వెళ్లకుండా వార్తలా?

ఇటీవల పత్రికలకు వివిధ కారణాలతో సరిపడా విలేకర్లు ఉండటం లేదు. దీంతో సంఘటనా స్థలానికి వెళ్ళే వీలు విలేకర్లకు దొరకడం లేదు. దీంతో ఆయా కార్యక్రమాల వివరాలను కార్యక్రమ నిర్వాహకులు అందించే సమాచారంతోనే వార్తలను ప్రచురించాల్సి వస్తోంది. దీంతో వార్తల్లో నాణ్యత కొరవడి పాఠకులను ఆకర్షించలేకపోతోంది. స్పాట్‌లో విలేకరి లేనప్పుడు అందే సమాచారంలో అస్పష్టత ఉంటుంది. ఉదాహరణకు ఓ రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం చెందారనుకుంటే ఘటనా స్థలిలో విలేకరి లేనప్పుడు పోలీసులు పంపించిన సమాచారామో లేక మరొకరు పంపించే సమాచారం ఆధారంగానే వార్తను ప్రచురించాల్సి ఉంటుంది. అదే సమయంలో ఘటనా స్థలిలో ఉన్న మరో పత్రికా విలేకరికి ఏదైనా ఆసక్తికర అంశమో లేక మరోదో తప్పిదం కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉండే అవకాశమున్న ఆధారాలు లభ్యం కావొచ్చు. అలాంటప్పుడు ఆ పత్రిక ఆ అంశాన్ని హైలెట్ చేస్తూ కథనాన్ని ప్రచురిస్తే ఆ పత్రిక కథనం ముందు స్పాట్‌లో లేని విలేకరి రాసే కథనం తేలిపోతుంది. నాణ్యమైన వార్తలను, పాఠకులను ఆకటుకునేవిధంగా అందించాలనుకుంటే విలేకర్లు తప్పక స్పాట్‌లో ఉండి సమాచారాన్ని సేకరించినప్పుడే సాధ్యపడుతుంది. అదేవిధంగా ఏదైనా సమావేశం జరిగి పార్టీ నేతలు ఎవరో ఒకరు ప్రభుత్వం మీదనో లేక ముఖ్యమంత్రి మీదనో ఘాటుగా అవినీతి ఆరోపణలు చేశారనే అస్పష్ట సమాచారం స్పాట్‌లో లేని విలేకరికి ఎవరి ద్వారానో తెలిసిందను కుంటే తెలిసిన విషయాన్ని నిర్ధారణ చేసుకోకుండా ప్రచురిస్తే చిక్కుల్లో పడే అవకాశం ఉంటుంది. విలేకరి స్పాట్‌లో లేనప్పుడు నమ్మదగిన సమాచారం అంద నప్పుడు అస్పష్ట సమాచారంతో లేక ఎవరో ఇతర వ్యక్తులు అందించే సమాచారంతో వార్తలుగా మలచకపోడమే మేలు. ఎందుకంటే మనం మొదట్లో చెప్పుకున్న ఏం జరిగింది? ఎక్కడ జరిగింది? ఎప్పుడు జరిగింది? ఎక్కడ జరిగింది? ఎవరికి జరిగింది? ఎలా జరిగింది? ఎందుకు జరిగింది? ఈ ప్రశ్నలకు సమాధానం అస్పష్టంగా ఉన్నప్పుడు ఏ పాఠకులు ఆ వార్తను చదవడానికి ఆసక్తి చూపరు. మనమే పాఠకులైతే మనం అందించే అస్పష్ట సమాచారంతో నిండిన వార్తను చదవగలుగుతామా? అని ప్రశ్నించుకోవాలి. ముందుగా మనలో ఉన్న పాఠకుడిని సంతృప్తిపర్చిన తర్వాతనే మిగతా పాఠకులకు వార్తను అందించే ప్రయత్నం చేయాలి.

..................

మరో అంశంతో మరో వ్యాసంలో..



మానసాని కృష్ణా రెడ్డి
9618616110
8074124190




---

## ఎంపీడీవో కార్యాలయంలో
# వార్డు సభ్యులకు శిక్షణ

**వాస్తవం : అందోల్**

సంగారెడ్డి జిల్లా అందోల్ మండల పరిధిలోని 10 గ్రామల పంచాయతీ వార్డు సభ్యులకు అందోల్ మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గత మూడు రోజులుగా ఈ శిక్షణ కార్యక్రమం ఆందోల్ ఎంపీడీవో రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో జరుగుతుంది. ఇందులో ఆయన మాట్లాడుతూ గ్రామాలలో నెలకొన్న మౌలిక సదుపాయాల గురించి శిక్షణ ఇచ్చామన్నారు. ఈ



కార్యక్రమంలో మండల పరిధిలోని 10 గ్రామాల పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్టాపన

**పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**వాస్తవం : చందుర్తి**

చందుర్తి మండల కేంద్రంలో ఇటీవల నూతనంగా నిర్మించిన శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించే విగ్రహా ప్రతిష్టాపన మహోత్సవంలో ప్రభుత్వ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చందుర్తి గ్రామ పంచాయతీ సర్పంచ్ పులి సత్యం గౌడ్, రుద్రంగి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, ఆలయ కమిటీ ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.



# ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**ఇందిరాపార్క్ చౌరస్తాలో వాహనదారులకు ప్రత్యేక ప్రచారం**

**డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ పత్రాలు తప్పనిసరి**

**హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపవద్దని సూచన**

**మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు**



**వాస్తవం: గజ్వేల్ ఆర్ :**

కమీషనర్ ఆఫ్ పోలీస్ సిద్దిపేట ఆదేశాల మేరకు 'అరైవ్ –అలైవ్' రోడ్ సేఫ్టీ కార్యక్రమంలో భాగంగా గజ్వేల్ పట్టణంలోని ఇందిరాపార్క్ చౌరస్తాలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గజ్వేల్ ఇన్స్పెక్టర్ రవికుమార్, గజ్వేల్ ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ సంయుక్తంగా పాల్గొని ప్రజలకు, వాహనదారులకు, ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, వాహనానికి సంబంధించిన పత్రాలను వెంట ఉంచుకోవాలి. మోటార్ సైకిల్ వాహన దారులు హెల్మెట్ ధరించకుండా ప్రయాణించరాదు అని సూచించారు. మానవ తప్పిదాల వల్లే అధిక శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అందుకే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలి. ఆటోలను కేటాయించిన పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలిపివేయాలి. రోడ్డుకు అడ్డంగా పార్కింగ్ చేయకూడదు. రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేయడం అత్యంత ప్రమాదకరం అని హెచ్చరించారు. మద్యం సేవించి ఆటోలు లేదా ఇతర వాహనాలు నడపవద్దు. అలా చేస్తే మీ ప్రాణాలతో పాటు ప్రయాణికుల ప్రాణాలు కూడా ప్రమాదంలో పడతాయి. ఆటోల్లో అధిక శబ్దంతో స్పీకర్లు ఏర్పాటు చేయడం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం వంటి చర్యలు మోటార్ వెహికల్ చట్టం ప్రకారం శిక్షార్హం. నియమాలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు అని స్పష్టం చేశారు.రోడ్డు భద్రత నియమాలను పాటించి ప్రమా దరహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పోలీసులు పిలు పునిచ్చారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ట్రాఫిక్ సిబ్బంది, గజ్వేల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# దేవాలయ భూమిపై ఉద్రిక్తత

**- మజీద్పల్లి గ్రామంలో 2 ఎకరాల 20 గుంటల భూమి వివాదం**

**- ఇరు వర్గాలకు సమాన హక్కులు కల్పించాలని ముదిరాజుల డిమాండ్**

**- ఎల్లమ్మ గుడి నిర్మాణం తరువాత దుర్గమ్మ గుడి స్థలంపై అభ్యంతరాలు**

**- 5 ఈత చెట్లు విరిగాయన్న ముదిరాజ్ సంఘం**

**- కనకదుర్గమ్మ, పోలేరమ్మ, నాంచారమ్మ గుడిలకు తాతముత్తాతల నుంచే పూజలు**

**- రెవెన్యూ అధికారుల సమగ్ర విచారణకు విజ్ఞప్తి**



**వాస్తవం : గజ్వేల్ ఆర్ సి :**

సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం మజీద్పల్లి గ్రామంలో దేవాలయ భూమి విషయంలో ఇరు వర్గాల మధ్య వివాదం నెలకొంది. ఖాతా 5022, సర్వే నెంబర్ 56/12/2లో ప్రభుత్వంగా కేటాయించిన 2 ఎకరాల 20 గుంటల భూమిపై హక్కుల అంశం చర్చనీయాంశంగా మారింది. గ్రామంలోని గౌడ సంఘం నాయకులు ఇప్పటికే ఎల్లమ్మ గుడి నిర్మించుకోగా, మిగిలిన భూమిని దుర్గమ్మ గుడి కోసం కేటాయించారని ముదిరాజ్ సంఘం నాయకులు తెలిపారు. దుర్గమ్మ గుడి నిర్మాణం కోసం స్థలం చదును చేసే సమయంలో ఒక పెద్ద ఈత చెట్టు, ఐదు చిన్న ఈత చెట్లు విరిగి పోయాయని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఈ స్థలంలో ఈత మొక్కలు నాటిన విషయం గ్రామస్తులకు తెలిసిందేనని, ఇప్పుడు భూమి మొత్తం గౌడ కులస్తు లకే చెందుతుందంటూ ప్రచారం చేయ డం సరికాదన్నారు. తమ తాతముత్తా తల కాలం నుంచే కనకదుర్గమ్మ, పోలేరమ్మ, నాంచారమ్మ గుడిలకు పూజలు నిర్వహిస్తున్నామని, గ్రామంలో ఇన్నాళ్లు అన్నదమ్ముల్లా కలిసి ఉన్నామని తెలిపారు. ఇప్పుడు దుర్గమ్మ గుడి నిర్మాణానికి ముందుకు వస్తే భూమి కోల్పోతామనే సాకుతో తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. మండల రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ జరిపి ఇరు వర్గాలకు న్యాయం చేయాలని ముదిరాజులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో లింగ మల్లయ్య, కల్వకుంట్ల బిక్షపతి, గుంటుక మహేష్, లింగ పాండు, చంద్రం, సురేష్, గుంటుక శంకర్, స్వామి, బాలరాజ్, తలారి స్వామి, రాము, శ్రీను, యాదగిరి, ఆంజనేయులు, సుధాకర్, రవి, గణేష్ పాల్గొన్నారు.


జన్మదినోత్సవాలు, పదవీ విరమణ శుభాకాంక్షల

ప్రకటనల కోసం సంప్రదించండి

8074124190





# రోడ్డు ప్రమాదాల నివారణ, సురక్షిత ప్రయాణమే లక్ష్యం

**గోదావరిఖని టూ టౌన్ సీఐ ప్రసాద్ రావు**




**వాస్తవం : గోదావరిఖని ఆర్సీ**

రోడ్డు ప్రమాదాల నియంత్రణ,సురక్షిత ప్రయాణం మరియు వాహనదారుల ప్రాణాల రక్షణను ప్రధాన లక్ష్యంగా తీసుకుని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన "అరైవ్–అలైవ్" కార్యక్రమంలో భాగంగా,పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు గోదావరిఖని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 8 ఇంక్లైన్ షిర్కే బస్టాండ్ వద్ద గోదావరిఖని టూ టౌన్ సీఐ ప్రసాద్ రావు ఆధ్వర్యంలో,అలాగే మంథని ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో మంథని ఓల్డ్ పెట్రోల్ బంక్ వద్ద విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతా నియమాల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన అధికారులు "అరైవ్–అలైవ్" కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం ప్రతి వ్యక్తి సురక్షితంగా తన గమ్యస్థానానికి చేరుకోవడమేనని తెలిపారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపడం పూర్తిగా నివారించాలని సూచించారు.

**79 ఏళ్ల స్వతంత్ర భారతంలో**

# కొనసాగుతున్న కుల వివక్ష

**బోడుప్పల్లో 366వ వారం**

**డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్‌కు జ్ఞానమాల**

**తీవ్రంగా ఖండించిన అంబేద్కర్ ఆశయ సాధన సంఘం**

**రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య**



**మేడిపల్లి : వాస్తవం :** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 366వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా కొమ్మూర గ్రామంలో ఆలయ ప్రవేశం వివాదంలో చాకలి కులానికి చెందిన గణేష్, చంద్రకళ,మౌనికలపై తుకారం రెడ్డి సతీష్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి మధు రెడ్డి అనే అగ్రకుల వ్యక్తులు అమానుషంగా దాడి చేసిన ఘటన చోటుచేసుకుంది ఆ ఘటనలో 2 నెలల పసి బిడ్డ మృతి చెందడం తీవ్ర వివాదానికి దారి తీసింది. ఈ సందర్భంగా అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య స్పందిస్తూ 79 ఏళ్ల స్వతంత్ర భారతంలో అగ్రకుల అహంకారంతో ఇంకా కుల వివక్షత, దళితులపై దాడులు జరుగుతూనే ఉన్నాయని, ఇలాంటి దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇటికల రవీందర్, రాపోలు శ్రీరాములు,సిరిసిల్ల సాగర్, యూనివర్సిటీ టీపీహెచ్డీ స్టూడెంట్ వడ్డీ ఎల్లన్న, గరుగుల యాకయ్య, శ్రీరాముల జ్ఞానే శ్వర్, సింగర్ ఉదయ్, చిల్ల అంజయ్య, సగ్గు నరసింహా, ఏ రాజేష్, కంచి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ ఆరోగ్యం కాపాడుకోవాలి

**2034 వరకు అధికారం మాదే**

**ప్రాజెక్టులు పూర్తి చేయకపోవడం కేసీఆర్ ప్రభుత్వానిదే**

**కాళేశ్వరం ప్రాజెక్టు నిరుపయోగం కానివ్వం**

**ప్రజా తీర్పు వ్యతిరేకంగా ఉన్నా మార్పు రావడం లేదు.**

**సహితుకమైన సలహాలు ఇస్తే స్వీకరిస్తాం**

**రెండేళ్లలో ప్రాజెక్టులు అన్ని పూర్తి చేస్తాం**

**సీఎం రేవంత్ రెడ్డి ధీమా**

**వాస్తవం, ములుగు, ఫిబ్రవరి 22:**

ఇంకో 10 ఏళ్ల వరకు పదేండ్ల వరకు కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంటుందని, అప్పటివరకు తన ఆరోగ్యాన్ని కెసిఆర్ చింత లేకుండా కాపాడుకొని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలన తీరును చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిలషించారు. ఆదివారం ములుగు జిల్లా కన్నయ్య గూడ మండలం కన్నాయిగూడెం మండలం తుపాకుల గూడెం సమ్మక్క సాగర్ ప్రాజెక్ట్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహచర మంత్రులతో కలిసి సందర్శించారు. అభివృద్ధిపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు పైన నిపుణుల కమిటీ ఏర్పాటు చేశామని, ప్రాజెక్టు పైన మాత్రమే పొంగినట్లుగా కనిపిస్తుందని పొంగినట్లుగా కనిపిస్తుందని భూమి లోపల ఎలాంటి మార్పులు వచ్చాయో తెలుసుకునేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేసినట్లుగా తెలిపారు. భవిష్యత్తులో ఎలాంటి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోబోతున్నట్లుగా వివరించారు. కాళేశ్వరం ఎవరి సొత్తు కాదని, ప్రజల సొమ్ముతో నిర్మించిందని, గాలికి వదిలేయకుండా మళ్లీ ఉపయోగంలోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు.

**ప్రజా తీర్పు వ్యతిరేకంగా ఉన్నా మార్పు రావడం లేదు..**

ఎన్నికల సమయంలోనే రాజకీయాలు అని, కానీ బీఆర్ఎస్ నీళ్ల విషయంలో కూడా రాజకీయం చేస్తుంటే బాధగా ఉందని అన్నారు. ప్రజలు అసెంబ్లీ, లోక్ సభ, ఉప ఎన్నికలు, సర్పంచ్, మున్సిపాలిటీ ఎన్నికల్లో వారికి వ్యతిరేకంగా తీర్పు ఇచ్చినా.. వారిలో మార్పు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పది ఏళ్లు పరిపాలన చేసి అనుభవం సాధించి ఉన్న వాళ్లు 2 ఏళ్ల మా పాలనలో తప్పిదాలు ఉంటే సహేతుకమైన సలహాలు ఇస్తే స్వీకరిస్తామని అన్నారు.

**రెండేళ్లలో ప్రాజెక్టులు అన్నీ పూర్తి చేస్తాం..**

గోదావరి జలాల వివాదం రాజకీయ రంగు పులుముకుంది అని, ఉత్తర తెలంగాణను సస్యశ్యామల చేసే సమయం లో ఆరోపణలు,అబద్ధాల ప్రచారాలక వల్ల ప్రయోజనం లేదు అని స్పష్టం చేశారు.రాష్ట్రంలో గత ప్రభుత్వం వల్లనే ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయి అని,10 ఏళ్లలో చిత్త శుద్ధితో ప్రాణహిత,ఎస్ ఆర్ ఎస్ పి,దేవాదుల లాంటి ప్రాజెక్టులు పూర్తి చేసి 967 టీఎంసీ వాటాను వినియోగించు కుంటే బాగుండేది అని అభిప్రాయపడ్డారు.గోదావరి పైన కాళేశ్వరం తప్ప మిగిలిన ప్రాజెక్టులను పట్టించుకోలేదు అని అన్నారు.చిత్త శుద్ధితో నిర్మాణం పూర్తి చేయాలని భావిస్తున్నా మాకు నిధుల కొరత ఉంది అని అన్నారు. 2 ఏళ్లలో ఎట్టి పరిస్థితిలో ప్రాజెక్టలను పూర్తి చేయాలన్న చిత్త శుద్ధి మాకు ఉంది అని తెలిపారు.

**దేవాదులకు నిధులు మంజూరు..**

దేవాదుల ప్రాజెక్టు పూర్తికి సత్వరమే నిధులు మంజూరు చేస్తాం అని,6 వేల కోట్ల అంచనాలతో మొదలైన దేవాదుల ఇప్పుడు 18 వేల 5 వందల కోట్లకు చేరింది అని తెలిపారు.కృష్ణా నది జలాల పైన అపోహలు



సృష్టించారు..అసెంబ్లీలో చర్చ పెట్టి అన్నిటికీ సమాధానం ఇచ్చాం అని అన్నారు.అంత కుముందు మహబూబాబాద్ జిల్లా రెడ్డియాలలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు శ్రీకాంత్ రెడ్డి తండ్రి రాఘవేందర్ రెడ్డి ఇటీవల చనిపోయిన సందర్భంగా వారి దశదిన కర్మకు హాజరై నివాళులు అర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించారు.కార్యక్రమాలలో రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, శాసన సభ్యులు తెల్లం వెంకట్రావు, గండ్ర సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్.పి. సుధీర్ రామ్నాథ్ కేకన్ తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరాన్ని కొనసాగిస్తాం

(మొదటి పేజీతరువాయి)

పరిశీలించి దేవాదులపై మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి సమీక్షించారు. అనంతరం దేవాదుల పంప్‌హౌస్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి దేవాదులను పూర్తి చేసి, ఐదున్నర లక్ష ల ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తామని తెలిపారు. ఉత్తర తెలంగాణలోని అనేక ప్రాంతాలతోపాటు వరంగల్‌కు దేవాదుల నుంచే తాగునీరు అందుతుందని, ప్రాజెక్ట్‌పై ప్రణాళికతో ముందుకు పోతున్నామని చెప్పారు. ఈ ఏడాది జూన్ 2లోగా దేవాదుల ప్రాజె క్టు నిర్మాణానికి కావాల్సిన భూసేకరణ కోసం రూ.600 కోట్ల నిధులను మంజూరు చేస్తామని సీఎం తెలిపారు. భూసేకరణలో జాప్యం వల్ల ప్రాజెక్ట్ పనులు ఆగకూడదని స్పష్టంచేశా రు. అన్ని ప్రాజెక్టుల భూ సేకరణకు కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. నెల రోజుల్లో దేవాదుల పంప్‌హౌస్‌కు మరమ్మతులు చేస్తామని వివరించారు.80% పూర్తయిన ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం వద్ద నిధులు లేవని చెప్పారు. రామప్ప చెరువు నుంచి జంపన్న వాగుకు నీరందించే ప్రణాళికలపై నివేదిక అందించాలని ఆదేశించారు. 1994 నుంచి టీడీపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు పదేండ్ల పాటు అధికారం ఇచ్చారని, 2034 దాకా తామే అధికారంలో ఉంటామని చెప్పుకొచ్చారు. విలేకరుల సమావేశంలో మంత్రులు ఉత్తమ్, సీతక్క, పొంగులేటి, ఎంపీ కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు.

# కొరని మురళీకృష్ణ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం



**వాస్తవం: రాజేంద్రనగర్**

రాజేంద్రనగర్ లోని గ్రేప్ రిసర్చ్ స్టేషన్లో రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేసిన కొరని మురళీకృష్ణ కొంత కాలం క్రితం ఆకస్మికంగా మరణించారు. టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగుస్తులంతా ఆయన కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని చేసి ఉదారతను చాటుకున్నారు. ఆదివారం రాజేంద్రనగర్ కార్యాలయంలో మురళీ కృష్ణ భార్యకు 20,516 రూపాయల చెక్కును అందజేశారు. నాన్ టీచింగ్ అసోసియేషన్ అండగా ఉంటుందని తెలుపుతూ ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాన్ టీచింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పోతురాజు యాదయ్య, కార్యదర్శి చెంచురామయ్య, వైస్ ప్రెసిడెంట్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ రజనీకాంత్, ముఖేష్, శ్రావణ్ కుమార్, బెంజిమెన్, వెంకట్ స్వామి, పేరి రెడ్డి, చంటి, హరి కృష్ణ, ఆనంద్ పాల్గొన్నారు.

## గంగారం పెద్ద చెరువు పరిసరాల్లో

# తీవ్రంగా దోమల బెడద

**ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆపాలని బీజేపీ నేతల హెచ్చరిక**

**వాస్తవం: శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 22 :** శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని గంగారం పెద్ద చెరువు పరిసర ప్రాంతాలలో దోమల సమస్య రోజురోజుకూ తీవ్ర రూపం దాల్చుతోంది. చందానగర్, దీప్తిశ్రీనగర్, అన్నపూర్ణ ఎన్క్లేవ్, శిల్పా ఎన్క్లేవ్, ఫ్రెండ్స్ కాలనీ, ఇక్రిశాట్ కాలనీ, అర్జున్ రెడ్డి కాలనీ, శుభోదయ కాలనీ, సురక్షా కాలనీ, ఆపర్ణ అపార్ట్మెంట్స్, పీజేఆర్ ఎన్క్లేవ్, కేఎస్ఆర్ లేఅవుట్, శ్రీరాంనగర్ కాలనీ, గౌతమీనగర్ కాలనీ, గంగారం ఎస్సీ బస్తీ, రాజేందర్ రెడ్డి కాలనీ, వేమన రెడ్డి కాలనీ, భవానీపురం, శంకర్ నగర్, వేమన వీకర్ సెక్షన్ బస్తీ, కైలాస్ నగర్, విద్యానగర్, జవహర్ కాలనీ, బిక్షపతి ఎన్క్లేవ్, డిఫెన్స్ కాలనీ, వేముకుంట, సురక్ష హిల్స్, సత్య ఎన్క్లేవ్ తదితర దాదాపు 100 కాలనీల ప్రజలు దోమల కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కంటిమీద కునుకు లేకుండా రాత్రులు గడపాల్సిన పరిస్థితి నెలకొంది. చెరువులో పెరుగుతున్న కాలుష్యం, నిల్వ నీరు, సరైన శు




భ్రత చర్యలు లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తున్న దని వారు విమర్శిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే తన పదవీకాలంలో దాదాపు రూ.25 కోట్లు ఖర్చు చేసినట్లు చెబుతున్నప్పటికీ, సమస్య మాత్రం పరిష్కారం కాలేదని ఆరోపిస్తున్నారు. ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో పోటీ చేసిన బీజేపీ అభ్యర్థి రవికుమార్ యాదవ్ స్పందిస్తూ చెరువును కాలుష్యానికి వదిలేసి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడడం మానుకోవాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యేను హెచ్చరించారు. తక్షణమే దోమల నివారణ చర్యలు చేపట్టి, చెరువు శుభ్రపరిచే పనులు ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు. చందానగర్ బీజేపీ కాంటెస్టెడ్ కార్పొరేటర్ సింధు రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రజల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, లేనిపక్షంలో మరింత పెద్ద స్థాయి ఆందోళనలు చేపడతామని బీజేపీ నేతలు హెచ్చరించారు.



# రాంరావుపల్లిలో ఉచిత వైద్య శిబిరం




**వాస్తవం: చందుర్తి**

చందుర్తి మండలం రాంరావుపల్లి గ్రామంలో కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రి సౌజన్యంతో రాజన్న సిరిసిల్ల జిల్లా ఆసుపత్రి మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కొమ్ము విద్యా సాగర్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ వాణి-గంగస్వామి సహకారంతో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు.ఈ మెగా వైద్య శిబిరంలో సుమారుగా 160 మందికి పైగా ప్రజలకు బిపి, జిఆర్ బిఎస్, ఈసీజీ పరీక్షలు నిర్వహించి డాక్టర్ విద్యా ప్రకాష్ ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకుని సమస్యలపై సలహాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వాణి-గంగస్వామి మాట్లాడుతూ.... కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత మెగా వైద్య శిబిరాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ కుమార్, మార్కెటింగ్ హెడ్ కోట కరుణాకర్, టీం లీడర్ దాసరి శ్రీకాంత్, ఆసుపత్రి క్యాంపు కోఆర్డినేటర్ వేముల శ్రీకాంత్, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# జాతీయ కబడ్డీ పోటీలకు సిద్దిపేట క్రీడాకారుడు వంశీ కృష్ణ ఎంపిక

**- మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందనలు**



**వాస్తవం, సిద్దిపేట :** సిద్దిపేట జిల్లా క్రీడాకారుడు వంశి కృష్ణ 72వ సీనియర్ జాతీయ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. జిల్లాకు చెందిన క్రీడాకారుడు జాతీయ స్థాయిలో అవకాశాన్ని దక్కించుకోవడం గర్వకారణంగా భావిస్తున్నారు. ఈ 72వ సీనియర్ జాతీయ కబడ్డీ పోటీలు గుజరాత్ రాష్ట్రంలోని వడోదరలో ఈ నెల 24వ నుంచి 27వ వరకు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో వంశీ కృష్ణ రాష్ట్రానికి ప్రా తినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వంశి కృష్ణను, తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి, సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కుంటనోళ్ల శివకుమార్‌ను పిలిపించి అభినందించారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.సీ. సంతోష్ గుప్తా , తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కాసాని వీరేష్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి మద్ది మహేందర్ రెడ్డిక,జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గిరి కొండల్ రెడ్డి, గుద్దలు రమేష్, సంపంగి రాజు, ప్రేమ్ నారా యణ, రంగనాథ్, కోశాధికారి సత్యం, జిల్లా సంయుక్త కార్యదర్శులు నరేంద్ర బాబు, శ్రీకాంత్, మహేష్, కరుణాకర్, కార్యవర్గ సభ్యుడు బాబు హర్షం వ్యక్తం చేశారు.

# వృథాగా పోతున్న తాగునీరు

**వాస్తవం, మందమర్రి ఫిబ్రవరి 22:**

సింగరేణి కార్మిక వార్డులకు సరఫరా అయ్యే రక్షిత తాగునీరు పైప్ లైన్ లీకేజ్ మూలంగా వృథాగా పోతోంది. శ్రీరాంపూర్ లోని సీతారాంపల్లి గోదావరి ఇంటెక్ వెల్ నుండి పట్టణం లోని కార్మిక కాలనీలకు పైప్ లైన్ ద్వారా సింగరేణి యాజమాన్యం గోదావరి తాగునీరు సరఫరా చేస్తుంది. కార్మిక కాలనీలకు సరఫరా అయ్యే తాగునీరు పట్టణంలోని మంజునాథ గార్డెన్ సమీపంలోని ఎయిర్ వాల్వ్ వద్ద పైప్ లైన్ లీకేజీ మూలంగా తాగు నీరు వృధాగా పోతుంది. లీకేజీ లకు మరమ్మతులు చేపట్టి కార్మిక కాలనీలకు తాగునీరు అందించాలని కార్మికులు కోరుతున్నారు.

